# అడ్డురాళ్ళు

విదేశాల్నుంచి తిరిగి వచ్చిన నాకు, నేను పనిజేస్తోన్న సంస్థ ఘనమైన స్వాగతాన్నే యిచ్చింది. మెడ నిండుగ దండలు వేసికొని, అందరి ముందూ నడుచుకొంటూ వెళ్ళి కార్లో కూర్చోడానికి సిగ్గనిపించి, వేసిన పూలమాలల్ని తియ్యబోతోంటే, ఆ నా ప్రయత్నాన్ని కొనసాగనివ్వలేదు - నా పై అధికారులూ, తోటి ఉద్యోగులూ. రెండేళ్ళ పాటుగా దేశం వదిలి తిరిగివచ్చిన నేను - ఎదురు చూసింది, వీళ్ల కోసమూ కాదు, చేసిన సత్కారానికీ కాదు. కార్లో కూర్చొన్న తర్వాత, కాంతారావు నా మొహంలో దిగులు కనిపెట్టి అన్నాడు.

"నీలో హుషారెందుకు లేదో అర్థమైంది! నీ భార్యాబిడ్డలెందుకు రాలేదని కదూ? దానికో కారణం ఉంది!"

నాలో ఒక్కసారిగా కంగారు పట్టుకొంది. వెనక్కు పరుగెడుతున్న రోడ్డు పక్క చెట్లలా నా ఆలోచనలు నా మనసుని దూసుకొని పోసాగాయి. పర్యవసానంగా బిగుసుకు పోయిన నన్ను చూసి, కాంతారావు నవ్వసాగాడు.

"నువ్వేమీ భయపడనవసరం లేదు. మీ శ్రీమతి దగ్గర్నుంచి నిన్ననే మా ఆవిడకు ఉత్తరం వచ్చింది. వాళ్లు వద్దామని యెంత ప్రయత్నించినా, పెద్దవాళ్ళు రానివ్వలేదుట! 'నీ మొగుణ్ణి చూడడానికి నీకెంత తహతహగా వుందో, కన్నందుకు మాకూ అంత యిదిగా ఉంది. నువ్వక్కడికిపోతే, వాడిప్పట్లో ఇక్కడికి రాడు. నువ్వు కనక యిక్కడే ఉంటే, నిన్ను తీసుకుపోవడం కోసమైనా వాడికి రాకతప్పదు! వచ్చి నాలుగు రోజులుండిన తర్వాత, మీరందరూ కలిసి వెళ్ళవచ్చును -' అని మీ అమ్మ అడ్డు వేసిందట!" అన్నాడు నవ్వడం ఆపిన తర్వాత.

కన్నవారిని విస్మరించేటంత వెధవని కాకపోయినా, రెండేళ్ళ పాటు విడిగా ఉన్న మా యిద్దరికీ ఉన్న తొందరపాటుని, పెద్దవాళ్ళు తేలిగ్గా తీసుకోవడం కొంత చికాకనిపించి, కాంతారావు నెత్తి మీద ఒక్కటి వేశాను! తెల్లబోతూ నాకేసి చూశాడు. "అదంతే, ఇంక మాట్లాడకు!" అన్నాను విసుగ్గా.

నా బాధ గ్రహించాడు కనక తేలిగ్గా తీసుకొని అన్నాడు- "సరేలేవోయ్, యింతటి విరహమూను! నీ బాధ నీది, నా అదృష్టం నాది! రాత్రి ఎనిమిదింటికి వస్తాను. నువ్వు తీసుకొచ్చిన ఆ 'స్కాచ్'ని ఓ రెండు పెగ్గులు కొట్టి మరీ మేనేజింగ్ డైరెక్టర్ ఇంటికి డిన్నర్‌కి పోదాం!"

"నీ ఆశ అఘోరించినట్టే ఉంది! సీతాపతి రావు డిన్నర్‌కి పిల్చింది 'స్కాచ్' సీసాతో సహా! అంచేత మన మూడ్స్ బాగుపడేదక్కడే!" అన్నాను నవ్వుతూ.

కాంతారావు నెమ్మదిగా అన్న మాటలు చెప్పకపోవడమే మంచిది.

ఇల్లు చేరుకొన్నాను. కాంతారావు ఇల్లంతా శుభ్రం చేయించి ఉండడం మూలాన, నాకా రోజు శ్రమ అనిపించలేదు.

తర్వాత తాగుడు మైకంలో మరిచిపోతానేమోనన్న భయంతో, సీతాపతిరావింటికి వెళ్ళగానే పక్కకి పిల్చి, ఆ మర్నాడు మా ఊరు వెళ్ళి ఓ వారం పది రోజుల తర్వాత తిరిగి వచ్చి డ్యూటీలో చేర్తానని చెప్పాను.

"అసలీ సంగతి నేనే నీకు విమానాశ్రయంలో చెబ్దా మనుకొన్నాను. ప్లాంట్ పరికరాలన్నీ వచ్చి గోడౌన్లలో పడున్నాయి. నువ్వు పంపించిన ప్లాన్ ప్రకారం కొత్త కట్టడాలని సిద్ధం చేశాను. నువ్వు డ్యూటీలో చేరిన తర్వాత మరి తీరుబడి ఉండకపోవచ్చు. అందుకని ముందుగానే వెళ్ళి మీ వాళ్ళనందరినీ చూసి రావడం మంచిది. పది రోజులు, ఇరవై రోజులు. నెల.... నీ యిష్టం!" అన్న సీతాపతిరావు మాటలకు కృతజ్ఞతలు తెలుపు

కొంటూ, నలుగురి మధ్యకూ నడిచాను.

నేను తీసుకురాగలిగిన ఆ ఒక్క స్కాచ్ బాటిల్‌కూ, మరో నాలుగు దేశవాళీ విస్కీ సీసాలు అదనంగా తెచ్చి, సీతాపతిరావు మంచి ఆర్భాటంగానే ఏర్పాట్లు చేశాడు. గొంతులోకి దిగుతున్న ఒక్కొక్క పెగ్గూ నాలికను ముద్దుబారుస్తోంటే, ముద్ద మాటల్తో అనుభవాల్ని చెప్తూ విందారగించి యిల్లు చేరేసరికి రాత్రి ఒంటిగంటయింది. నాలుగిళ్ల కవతలగా ఉండే కాంతారావుకి ఆ రాత్రి మా యిల్లే శరణ్యమైంది. రాత్రి పన్నెండు దాటి యింటికి వెళ్ళాడంటే, "డోస్" యెక్కువయినట్లే లెక్క. కాంతారావు శ్రీమతికి! అరు నూరైనా మరి తలుపు తెరవదు! ఇటువంటి అనుభవాలు అతనికీ, అతగాడి మహాకాయం మా 'సోఫా కం బెడ్'కీ కొత్త కాదు!

కలలాంటి విదేశీయ వాతావరణం నుంచి వాస్తవంలోకి దిగజారడానికి రెండు రైళ్ళు, రెండు బస్సులు మారి మా ఊరు వెళ్ళే ప్రయాణం ఎంతగానో దోహదం చేసింది. నడవ గుమ్మంలో బిక్కచచ్చిపోయిన మొహంతో నిల్చున్న సుశీలనీ, ఆప్యాయంగా విస్తట్లో నా కిష్టమైనవన్నీ వడ్డిస్తున్న అమ్మనీ చూస్తూ పాశ్చాత్య నాగరికత వాసనల్ని మరిచి పోయి, మళ్ళీ మన మధ్యలో పడ్డాను. ఇరవై రోజుల పాటు చూడవలసినవాళ్ల నందర్నీ చూసి, యివ్వవలసిన బహుమతులిచ్చి, కుటుంబాన్ని వెంట పెట్టుకొని హైదరాబాద్ తిరిగి వచ్చిన రోజున, చెయ్యి జారిన నా మీది అధికారం తిరిగి హస్తగతమైనందుకు, సుశీల హాయిగా నవ్వింది. ఏవిఁటో, ఈ ఆడవాళ్ల మనస్తత్వం చాలా విచిత్రంగా ఉంటుంది!

తిరిగి డ్యూటీలో చేరిన రోజు నుంచీ, నిజంగానే నాకు ఊపిరి తిరగలేదు. ప్లాంట్ తాలూకు యంత్రాలనన్నింటినీ గోడౌన్ల నుంచి తెప్పించి, పరీక్షించి, వాటిని కొత్తభవనంలో అమర్చడంలో, నాలుగైదు నెలలు ఎలా గడిచిపోయాయో నాకు తెలియదు. చాకుల్లాంటి కుర్రవాళ్లకి సలహాలిస్తూ, దగ్గరుండి ప్రతి పనినీ స్వయంగా పర్యవేక్షిస్తూ, ప్లాంట్‌ని అనుకొన్న సమయం కంటే రెండు నెలలు ముందుగానే సిద్ధం చేశాను. సీతాపతి రావు నన్ను మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు.

నా కిచ్చిన మెచ్చుకోలును నా క్రింది వారందరితోటీ ఆనందంగా పంచుకొని, ఆ రోజున వారందరికీ నా ప్లాంట్‌లో ఓ చిన్న పార్టీ యిచ్చాను. అందరూ వెళ్ళిన తర్వాత నా ఆఫీసు రూంలో ఏదో పని చేసుకుంటున్న సమయంలో, సింథటిక్స్ హెడ్ నీలకంఠం లోపల అడుగు పెట్టాడు. ఎదురుగా వున్న కుర్చీలో కూలబడుతూ, టేబుల్ మీద ఉన్న పేకెట్ నుంచి ఓ సిగరెట్ తీసి ముట్టిస్తూ అన్నాడు- "నీ ప్లాంట్ చూశాను. ఇంత కాంప్లికేటెడ్ మెషినరీని, నువ్వింత త్వరలో సిద్ధం చెయ్యగలుగుతావని మేమెవ్వరం అనుకోలేదు!" పొగుడ్తూ అన్న అతని మాటల్లో, లీలగా అసూయ తొంగి చూసింది.

"ఈ ఘనత నాదొక్కడిదే కాదు. నేనక్కడున్న రెండు సంవత్సరాల్లోనూ, చాలా ఆది వారాలు కూడా తన సమయాన్ని నా కోసం వినియోగించి శిక్షణ యిచ్చిన యింజనీర్ 'డాన్'ది. సరే, యిక్కడ నా సెక్షన్లో పనిచేస్తున్న వాళ్లందరూ చాలా వుత్సాహం చూపడం

మూలాన, నేను శిక్షణ పొందిన గౌరవం నాకు దక్కింది. ముఖ్యంగా అసిస్టెంట్ ఇంజనీర్ 'పీతాంబరం', చీఫ్ సూపర్‌వైజర్ 'రామచంద్రం' ఎంతగానో శ్రమించారు."

నేను చెప్పిన మాటలు విని నీలకంఠం అదోలా నవ్వాడు. 'ఎందుకలా నవ్వుతావ్?' అన్నట్లుగా చూశాను.

'నీ వెర్రితనాన్ని చూసి నవ్వక ఏం చెయ్యమంటావ్?! నీ కొచ్చిన పేరు నలుగురి తోటీ పంచుకుంటే, నిన్ను నువ్వు బలహీనం చేసికొన్నట్లవుతుంది. అది నీ భవిష్యత్తుకే దెబ్బ. నువ్వులేందే కాని పని జరగదన్న అభిప్రాయం అధికారులకు కలిగిన రోజున,నువ్వు చెప్పిందల్లా వాళ్లు వినక తప్పదు. అందుకనే హెచ్చరిస్తున్నాను.అప్పుడే పీతాంబరం, రామ చంద్రం చాలా గ్రహించారనుకొంటాను. వాళ్ళకు నువ్వు మంచి శిక్షణే యిస్తున్నట్లుంది?'

నాకు చిర్రెత్తుకొచ్చింది.

"నువ్వు చెత్తగా మాట్లాడుతున్నావ్. ఈ ప్లాంట్ సరిగా నడవాలంటే నాకున్న బాధ్యత కంటే, వాళ్ల చురుకుదనమూ, గ్రాహ్యశక్తే ఎంతో అవసరం. వాటికి నేను దోహదం చేసినట్లయితే, నా పని చాలా సులువుగా ఉంటుంది. ఇరవై నాలుగ్గంటలూ వాళ్లను కనిబెడ్తూ వుండి, నా పనిని మరింత కష్టతరం చేసుకోవడం అర్థం లేని పని!" కోపంగా అన్నాను.

"సరేలే, నీ కోపాన్ని మెచ్చుకొన్నాను కాని, యూరియా ప్లాంట్ 'నంబియార్' గతి ఏమైంది? అభిప్రాయ భేదాలొచ్చిన వారం రోజుల్లో, పదిహేనేళ్ల సర్వీసుని నిర్లక్ష్యం చేసి, నిర్దాక్షిణ్యంగా ఉద్యోగంలోంచి తీసి పారేశారు! అతగాడి జూనియర్ ఆ ప్లాంట్ హెడ్ అయ్యాడా, లేదా?"

"అలాగని మనం నేర్చుకొన్నదాన్నీ, మనకు తెలిసినదాన్నీ నలుగురికీ చెప్పకుండా వుండడం ఏమంత సబబైన పని? చెప్పకపోతే ఈ సాంకేతిక విజ్ఞానం ఎలా అభివృద్ధి పొందుతుంది? అది మన కంపెనీకే కాక, దేశ ప్రగతికి కూడా అవసరమే కదా!" -కొంచెం ఆవేశంగానే అన్నాను.

"నీ మాటలు చాదస్తంగా ఉన్నాయి. ఓసారి వాస్తవాన్ని చూడు. నీ తెలివితేటలు అమోఘం అని, చాలా మందిని వదిలి నిన్ను విదేశాలకు పంపారు. నాలాంటివాడైతే, నాలుగేళ్ళక్కడున్నా మళ్ళీ వాళ్ళ నిపుణుడొస్తేనే కాని, యిటువంటి ప్లాంట్‌ని సిద్ధం చెయ్యడం కాని పని! నువ్వు పీతాంబరానికి, రామచంద్రానికీ ఇప్పట్నుంచే అన్నీ వివరంగా చెప్పుకొంటూపోతే, నీ రోజులు లెక్కపెట్టుకోవచ్చు. అయినా నీకు తెలియని మరో సంగతి చెప్తున్నాను. పీతాంబరం, సీతాపతిరావుకి దగ్గర చుట్టం. అందుకని....."

"నువ్వేమీ చెప్పకు. వాళ్ళంతటవాళ్ళనే నెమ్మదిగా నేర్చుకోనీ అంటావ్, అంతేనా? సరేలే, ఈ సొదకేంకాని పోదాం పద, చీకటి పడ్తోంది" అన్నాను, కుర్చీలోంచి లేస్తూ.

నీలకంఠం మరి మాట్లాడలేదు.

కావాలని కాకపోయినా, పొరబాటుగానైనా ఉప్పురాయిని పొంగుతున్న పాలల్లో

పడవేస్తే, అవి విరగక మానవు. సరిగ్గా నా విషయంలో ఇదే జరిగింది.

"సార్, వాళ్ళిచ్చిన డాక్యుమెంట్‌కీ, మీరేర్పాటు చేయించిన విధానానికీ చాలా తేడాలు కనిపిస్తున్నాయి. ఎందుకని?"- ప్రశ్న.

"డాక్యుమెంట్ పాతది!"- నా సమాధానం.

"ఈ కొత్త విధానం వల్ల కలిగే ప్రయోజనాలేమిటి? అసలు ప్లాంట్ పనిచేసే క్రమంలో అవి ఏ మార్పులు కలిగిస్తాయి?"

"మీకిప్పుడు చెప్పినా అర్థం కాదు. అనుభవం మీద నెమ్మదిగా తెలుస్తుంది."

"చివరి స్టేజ్‌లో వచ్చే వాయువుల్ని అంటించి మండేటట్లు చెయ్యడం కోసం బర్నర్స్‌ని ఏర్పాటు చెయ్యవలసుంటుందని డాక్యుమెంట్‌లో రాయబడింది. కాని మీరు వాటిని గొట్టాల ద్వారా మధ్య స్టేజ్‌లో వున్న కంప్రెషన్ ఛాంబర్స్‌కి మళ్ళించారు. ఎందుకని?"

"చెప్పానుకదా, అనుభవం మీద తెలుస్తుందని!"

"సార్, ప్లాంట్ సిద్ధమైంది కదా. కావలసిన ముడిసరుకు విశాఖపట్నం రేవులో దిగడానికింకా ఓ రెండు మూడు నెలలు పట్టవచ్చునంటున్నారు. ఈలోపుగా మనం ప్లాంట్‌ని నడిపి పరీక్షిస్తే బావుంటుందేమో?"

"దానికేముంది అలానే చేద్దాం. కాని నేను చెప్పినట్టుగా ఇది ఏభై నాలుగ్గంటలు అవిరామంగా జరిగే ప్రోసెస్. మధ్యలో ఏమాత్రం కరెంట్ పోయినా యంత్రాంగం దెబ్బ తింటుంది. అందుకని ముందుగా మనం స్టాండ్‌బైజనరేటర్‌ని ఏర్పాటుచేసుకోవాలి. నేను వచ్చిన వెంటనే తెలియజేసినా, స్టోర్స్ సెక్షన్ ఇంతవరకూ, దాన్ని కొనలేకపోయింది!"

ఇలా వాళ్ళు ఎన్నో ప్రశ్నలు, అనేక సందర్భాల్లో వేశారు. కప్పదాటు సమాధానాలిస్తూ పోయాను.చిన్నబుచ్చుకొన్న ముఖాలతో వెళ్ళిపోయే వాళ్ళని చూసి లోలోపల బాధపడ్డా, నేను శ్రమించి సంపాదించిన అనుభవాన్ని వాళ్లకు సులువుగా తెలియజెయ్యడానికి మనసొప్పలేదు.

జనరేటర్ విషయమై పీతాంబరం, రామచంద్రం పూనా వెళ్ళినప్పుడు, ప్లాంట్‌ని ఓ 'షార్ట్ సైకిల్'లో నడిపి, అన్నీ సవ్యంగా వున్నాయో లేవో చూశాను. కొన్ని మార్పులు చెయ్య వలసి వచ్చింది. మరీ బావుండదని, వాళ్లు తిరిగి వచ్చిన తర్వాత, వాళ్లచేతే ఆ మార్పులు చేయించాను. అయితే అవి ఎందుకు చెయ్యవలసి వచ్చిందో వాళ్లకి తెలియదు. చెప్పింది యాంత్రికంగా చేశారంతే.

మార్పులు జరిగిన తర్వాత ప్లాంట్‌ని మళ్ళీ నడిపాను. పనిజేస్తోన్న అరవై మందికి ఎవరెవరు ఎక్కడ ఏం చెయ్యాలో బోధించాను. అవన్నీ యాంత్రికంగా చెయ్యవలసిన పనులు. పీతాంబరం, రామచంద్రం వందలాది ప్రశ్నలడిగారు. చెప్పాలనుకొన్న వాటికి చాలా వివరంగా చెప్పాను. చెప్పకూడదనుకొన్న వాటికి కప్పదాటు సమాధానాలిస్తూ పోయాను. కొన్ని ప్రశ్నలకు సమాధానాలివ్వకుండా, లౌక్యంగా నవ్వి పారేశేవాణ్ణి. నా

పెదాల మీద చిరునవ్వు చూసి వాళ్ళు మరి మాట్లాడేవాళ్ళు కాదు.

విశాఖపట్నం నుంచి ముడిసరుకందగానే, వున్న అరవై మందినీ మూడు జట్లుగా విభజించాను. కంపెనీ ఛెయిర్‌మేన్ వచ్చి, మంచి అట్టహాసంగా ప్రారంభోత్సవం చేసి వెళ్ళిపోయాడు. లక్షన్నర రూపాయల విలువ చేసే ముడిసరుకు ప్లాంట్‌లో ప్రవేశించింది. ఏభై నాలుగ్గంటల తర్వాత, అయిదు లక్షల విలువ గల ప్రోడక్ట్ బయటకు వస్తుంది. తర్వాత ఓ వారం రోజుల పాటు ప్లాంట్‌ని శుభ్రపర్చాలి. ఇదీ ప్లాంట్ పనిచేసే క్రమం.

ప్లాంట్‌లోనే మకాం వేశాను. మొదటిరోజు అంతా సవ్యంగానే జరిగిపోయింది. రెండో రోజు ఉదయం, కంప్రెషన్ ఛాంబర్స్ దగ్గర అవసరమైన పీడన శక్తులను సరి చేస్తుండగా, స్టెనో పరెగుత్తుకొంటూ వచ్చి "వన్ మినిట్ బాస్" అంది.

"ఎందుకని? నేను ప్లాంట్‌లో వుండగా ఆఫీసు విషయాల్ని గురించి నన్ను విసిగించ వద్దని చెప్పానా? లేదా?" కసిరాను.

"క్షమించండి బాస్. కాని...." స్టెనో మాట పూర్తిచెయ్యకుండా, నా చేతిలో ఓ టెలిగ్రాం ఉంచి, వెళ్ళిపోయింది.

కంగారుగా టెలిగ్రాం చదివాను. 'నాన్నకి చాలా సీరియస్‌గా ఉంది. వెంటనే బయలుదేరి రావల్సింది'. తమ్ముడిచ్చిన టెలిగ్రాం. నా నవ నాడులూ కృంగిపోయాయి. పక్కనే ఉన్న 'స్టూల్' మీద కూలబడి, కణతలు పట్టుకొని, అచేతనంగా కూర్చుండిపోయాను. పీతాంబరం ఒక్క ఉదుటున నా పక్కకు వచ్చి, టెలిగ్రాం లాక్కొని చూసి, జాలిగా నా భుజం మీద చెయ్యి వేసి నిలబడిపోయాడు.

నేను ఏళ్ల తరబడి శ్రమించి సంపాదించిన అనుభవాన్నీ, నేను శిక్షణ పొంది గడించిన విజ్ఞానాన్నీ, నా కింది వాళ్ల కందిస్తే, వాళ్ళా అనుభవాన్నీ, జ్ఞానాన్నీ క్రింది మెట్లగా ఉపయోగించుకొని, వాళ్ళు గడించిన విజ్ఞానాన్ని వాళ్ల కింద వాళ్ళకి అందిస్తూపోతే, దేశం అతి త్వరగా ఎంత ప్రగతిని సాధిస్తుంది! ఈ ఆలోచనకి మూత పెట్టి, స్వార్థబుద్ధితో ప్రవర్తించినందుకు, నాకెంతటి శిక్ష లభించింది! నేను లేకపోయినా పని సవ్యంగా జరిగి పోతుందన్న హామీ అధికారులకివ్వలేని ఈ పరిస్థితిని కల్పించుకొన్నది నేనే గదా! అతగాడు లేకపోయినా, మొదటి యత్నంలోనే ప్లాంట్‌ని సక్రమంగా నడిపేటంతటి శిక్షణ కింది వాళ్ళకిచ్చాడన్న ఖ్యాతిని సంపాదించుకోకుండా నేనిదేం పని చేశాను?

నా ఉద్యోగాన్ని కాపాడుకోవాలన్నా, చాలా డబ్బు ఖర్చుపెట్టి నన్ను విదేశాలకు పంపిన కంపెనీకి లక్షలు నష్టం తీసుకురాకుండా వుండాలన్నా, పని పూర్తయ్యేవరకూ - అవసానదశలో ఉన్న కన్నతండ్రిని విస్మరించడం తప్ప మరో మార్గం లేదు.

ఇలాంటి దౌర్భాగ్య స్థితి మీరు తెచ్చుకోవద్దు. ఏది ఏమైనా నాలా ప్రవర్తించినవాళ్ళు, ప్రగతి పథంలో అడ్డురాళ్ళలా నిలబడిపోతారే కాని, మైలు రాళ్ళలా మట్టుకు కాదు.

●

*('జ్యోతి' మాసపత్రిక : ఏప్రిల్ 1979)*